క్లుప్తంగా

అయ్యప్పస్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

కొత్తూరు: పట్టణంలో ఉన్న హనుమాన్ ఆలయంలో గురువారం మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు శేఖర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్వాములు సోమ్లానాయక్, విఠల్‌చారి, విష్ణుమూర్తి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకుడు దత్తాత్రేయ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



సత్కారాన్ని అందుకుంటున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పార్టీ అభివృద్ధికి బండారు దత్తాత్రేయ క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. చండీఘడ్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను శ్రీవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన బండారు దత్తాత్రేయ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎంపీగా, గవర్నర్ స్థాయికి ఎదిగారన్నారు. బండారు దత్తాత్రేయ గత 35 సంవత్సరాలుగా బీజేపీ సిద్ధాంతానికి పాటుపడుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి దత్తాత్రేయ ఎంతో కృషి చేశారని, పార్టీ సిద్ధాంతం కోసం పని చేసిన కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ఇలాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకొని పార్టీ బలోపేతానికి క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అనంతరం బండారు దత్తాత్రేయ శ్రీవర్ధన్‌రెడ్డిని సత్కరించారు.

బీఆర్‌ఎస్‌పై విమర్శలు సరికాదు

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో పేద రైతుల మృతికి కారణం గత బీఆర్‌ఎస్ పార్టీనే అని, ఈ హైవేను పట్టించుకోకపోవటంతోనే ప్రమాదం జరిగిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడటంపై బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తీవ్రంగా మండిపడ్డారు. చేవెళ్లలో గురువారం ఆయన బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం పోగానే బీఆర్‌ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్‌లోకి ఏమి ఆశించి పోయారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎమ్మెల్యేకు ఉందన్నారు. నీలాంటి వలస పక్షి అవకాశవాదులు ఇలాంటి మాటలు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ ప్రయాణించే ఈ హైవే రోడ్డు ఇంత దారుణంగా ఉండటం చూస్తూ కూడా ఏడాది కాలంగా కనీసం స్పందించకపోవటం శోచనీయమన్నారు. పేద రైతుల ప్రాణాలు పోయిన తర్వాత ఈ రోడ్డు గుర్తుకు వచ్చిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న ఎమ్మెల్యే ఏనాడు ఈ రోడ్డు ప్రస్తావన తీసుకురాలేదని అప్పుడు ఏమి చేశాడని ఎద్దేవా చేశారు. పార్టీలో ఉన్న ఉద్యమకారులను, పార్టీ కోసం పనిచేసిన వారిని పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ఎమ్మెల్యేగా తాను చేయాల్సిన పనిని గాలికి వదిలేసి బీఆర్‌ఎస్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు ఆసిఫ్, నరేశ్, పృథ్వీ, తేజ, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కొందుర్గు: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధం కావాలని ఎంపీడీఓ లక్ష్మి అనురాధ సూచించారు. గురువారం గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు సరిగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు ఉంటే బాగు చేయించాలన్నారు. ఈ నెల 7న గ్రామ పంచాయతీ నోటీసు బోర్డుపై ముసాయిదా పోలింగ్ బూత్‌ల జాబితా వేయాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- షాద్‌నగర్‌కు బస్తీ దవాఖానా మంజూరు
- త్వరలోనే ప్రారంభించి పేదలకు వైద్యసేవలు అందిస్తాం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

షాద్‌నగర్‌రూరల్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రభుత్వం షాద్‌నగర్‌కు బస్తీ దవాఖానాను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నిరుపేదలకు కావాల్సిన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడంతో ప్రజల సంఖ్య పెరుగుతోందని, జనాభాను దృష్టిలో పెట్టుకొని బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు పాత వ్యవసాయ కార్యాలయ భవనాన్ని కేటాయించారని, రెండు నెలల్లో ఏర్పాటుకు కావాల్సిన అన్ని వసతులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆస్పత్రితో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుతాయన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారులు బస్తీ దవాఖానాకు కేటాయించిన పాత వ్యవసాయ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పీఓ అర్బన్ హెల్త్ డాక్టర్ వినోద్, మెటర్నల్, చైల్డ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పూనమ్, డీపీఏ ఎన్‌హెచ్‌ఎం అక్రం, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

మొయినాబాద్‌రూరల్: నేటి సమాజంలో విద్య, విజ్ఞానం ఎంతో విలువైందని, విద్యతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని హైదరాబాద్ స్వచ్ఛంద సేవకురాలు మన్నూరు సరస్వతీనర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మన్నూరు నర్సింహారెడ్డి జ్ఞాపకర్థంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మన్నూరు సరస్వతీ మాట్లాడుతూ.. నర్సింహారెడ్డి జ్ఞాపకార్థంగా ప్రతి నెల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏదో ఒక చోట విద్యాభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆలన పాలన, బొమ్మలతో పదాలు నేర్పితే చిన్నారులు తొందరగా నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సంఘం సభ్యులు ముదిగొండ రవియాదవ్, మాజీ సర్పంచ్ ముదిగొండ రాజయ్య, పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, కవిత, మహేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దాత సరస్వతీ

'సీఎం కప్'కు రిజిస్టర్ చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీఓ కృష్ణయ్య

కేశంపేట: సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 7, 8తేదీలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీఓ కృష్ణయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల పీఈటీలు, సీఎం కప్ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీఓ కృష్ణయ్య మాట్లాడుతూ.. సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులు, గ్రామాల్లో యువత పంచాయతీ కార్యదర్శులకు పేర్లను ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి

షాబాద్: గ్రామస్థాయి క్రీడాపోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 7, 8వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీఎం కప్–2024 క్రీడాపోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం మీ గ్రామంలోని పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి
- శంకర్‌పల్లిలో భారీ బైక్ ర్యాలీ

శంకర్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ఆరు గ్యారెంటీలు అని చెప్పి 66 మోసాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ గురువారం శంకర్‌పల్లి పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హామీలు అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి మెమోరాండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క–సారలమ్మలపై ఒట్టేసి చెప్పి, ఇప్పుడు మాట తప్పాడని ఆరోపించారు. అదేవిధంగా రైతులకు రైతుబంధు, పింఛన్ రూ.4వేలు, రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయలేదన్నారు. గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికే తప్పా సామాన్యుడికి మంచి చేసిన పని ఒక్కటి లేదని విమర్శించారు. ఇప్పటికైనా తమ పాలన విధానాన్ని మార్చుకొని ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, బీర్ల నర్సింహ, వెంకటేశ్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు మెమోరాండం ఇస్తున్న నాయకులు

యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ

కొందుర్గు: యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం కప్ పోటీలు ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డి, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదిలో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు నెంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంఈఓ గాయత్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ స్వాములు, బాలాజీ పాల్గొన్నారు.



కొందుర్గులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ

వేతనాలు పెంచాలి

షాద్‌నగర్‌రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో పని చేస్తున్న రీసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లకు వేతనాలను పెంచాలని కోరుతూ పట్టణంలోని ఆర్పీలు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ.. ఆర్పీలకు 2012 నుంచి 2018 వరకు ఎలాంటి వేతనాలను ఇవ్వకపోయినా ప్రభుత్వానికి పనులు చేసి పెట్టామన్నారు. 2018 నుంచి రూ.4వేల గౌరవ వేతనాన్ని ఎస్ఎల్ఎఫ్ ఖాతాల్లో వేస్తున్నారని, మున్సిపల్‌లో వారికి రూ.6వేలు ఇస్తున్నారన్నారు. మున్సిపల్ పరిధిలో వందశాతం ఓడీఎఫ్ సాధించడంలో ఆర్పీలే కారణమన్నారు. పట్టణంలో వందశాతం ఓడీఎఫ్, శానిటేషన్, తడి, పొడి చెత్త, ఇంటింటి సర్వే, హరితహారం చెట్ల పంపిణీ, నిరక్షరాస్యత, స్వచ్ఛ సర్వేక్షణ్, బీపీఎల్ సర్వే, డబుల బెడ్రూం ఇళ్ల సర్వే వంటి ప్రభుత్వం ఇచ్చిన పనుల్లో ఆర్పీల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్పీలకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించడంతో పాటు వేతనాలను పెంచేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆర్పీలు అనిత, విజయ, శైలజ, రెహనా, భవాని, యాదమ్మ, మాధురి, శారద, లక్ష్మి, సునీత, సత్య, లక్ష్మి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

సేంద్రియ ఎరువులతో నేలకు బలం



కొత్తూరు: నేలలో పోషకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: సేంద్రీయ ఎరువుల వాడకంతోనే నేలలు ఎప్పటికీ సారవంతంగా ఉంటాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా వారు గురువారం మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో పొలాలు కలుషితంగా మారడంతో పాటు రైతులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పొలాలు సారవంతంగా మారడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ముఖ్యంగా రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. పంటల సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల ద్వారా పొలంలో వినియోగించే పోషకాల గురించి తెలుసుకోవచ్చని వివరించారు. రైతులు మార్కెట్‌లో ఎప్పటికీ డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లావణ్య, శాంతి, రంజిత, నిర్మల, ఏఈఓ గోపాల్, ఏఈఓ దీపిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

నందిగామ: రైతులు తమ భూములలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ వాణి సూచించారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని మండల కేంద్రమైన నందిగామలోని రైతు వేదికలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పలు గ్రామాలకు చెందిన రైతులను ఉద్దేశించి ఏఓ వాణి మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా జరిగే ఉపయోగాలు, మట్టిలో పోషకాల లభ్యతను మెరుగుపరిచే పద్ధతులు, భూమి నాణ్యత, మట్టిలో సూక్ష్మపోషకాల లోపాలు, పచ్చిరొట్టతో ఉపయోగాలు, భూమి ఆరోగ్యం తదితర వివరాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కారోబార్లను పర్మినెంట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం నందిగామ మండల కారోబార్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. నందిగామ మండల పరిధిలో జీపీలలో పనిచేస్తున్న కారోబార్లు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీలలో కారోబార్లుగా విధులు నిర్వహిస్తూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మధ్య అనుసంధానకర్తలుగా పని చేస్తున్నామన్నారు. పనిభారం ఎక్కువైనా, వేతనాలు సకాలంలో రాకున్నా విధులు నిర్వహిస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తూ దుర్భర జీవితాలను గడుపుతున్నామని, గత పదేళ్లగా వేతనాలను పెంచాలని పాలకులు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారడంలేదని వాపోయారు. కారోబార్‌కు రూ.18వేల నుంచి 25వేలకు వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో పని చేసినంత కాలం కారోబార్లకు ప్రమాద బీమా, ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కారోబార్ల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

కొందుర్గు: దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాంగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ, ప్రత్యేక పరికరాల పంపిణీ, ఫిజియోథెరపీ వైద్యం వంటి ఎన్నో సదుపాయాలను కల్పించిందన్నారు. అదేవిధంగా విద్య, ఉద్యోగాల నియామకాల్లో రిజర్వేషన్ కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, ఎంఈఓ గాయత్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వాములు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్

కేశంపేట: నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్ఎస్‌యూఐకి ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన అనుమగళ్ల రమేశ్, తాలుకా ఉపాధ్యక్షులుగా నిర్దవెల్లి గ్రామానికి చెందిన అమీర్, కొత్తపేట గ్రామానికి చెందిన శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పిప్పళ్ల శ్రీనాథ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని నాయకులు సన్మానించారు. వీరితో పాటు ఇటీవల మార్కెట్ కమిటీలో ఎంపికైన డైరెక్టర్లు నిర్దవెల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్, కొండారెడ్డిపల్లికి చెందిన కరుణాకర్‌ను మండల కేంద్రంలోని చర్లమైసమ్మ దేవాలయం ప్రాంగణంలో సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీరేశ్ పాల్గొని మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో యెన్నం శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, గిరి, భాస్కర్, రాజేందర్, రాములు, గోపాల్, నగేశ్, భీమయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: యూత్ నాయకులను సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు వీరేశ్

యూత్ కాంగ్రెస్ సభ్యుల నియామకం

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ యువజన కమిటీ ఎన్నికలలో నూతన కమిటీ ఎన్నికైంది. ఇందులో చేవెళ్ల మండల యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పలుగుట్ట గ్రామానికి చెందిన మల్గారి కార్తీక్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షుడిగా ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కందికొండ మహేందర్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. మండలంలో యువజన కాంగ్రెస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు పార్టీకి అండగా యువజన కాంగ్రెస్ ఉంటుందని చెప్పారు. తమ ఎన్నికకు కృషి చేసిన పార్టీ నాయకులు, యువకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

శంకర్‌పల్లి: ఇటీవల ప్రకటించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామానికి చెందిన మోత్కుపల్లి మహిపాల్ చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా.. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన బొల్లారం ప్రశాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. యువత సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్‌రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిపై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్ తీవ్ర విమర్శలు చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణం నుంచి బైపాస్ రోడ్డువైపు మరోమార్గం ఉండే విధంగా వైజంక్షన్ నిర్మించడానికి చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.90కోట్లు మంజూరు చేయించామన్నారు. ఎమ్మెల్యేపై కాంగ్రెస్ పార్టీపై విష్ణువర్ధన్‌రెడ్డి నోటికొచ్చినట్లు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదన్నారు. పదేళ్ల పాలనలో రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టడంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలోనే రైతులకు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాలు చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, కొంకళ్ల చెన్నయ్య, ఎండీ.ఇబ్రహీం, బస్వం, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, ముబారక్, కరుణాకర్, యాదగిరియాదవ్, అన్వర్, హుస్సేన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మండల కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ సమక్షంలో ఫరూఖ్‌నగర్ మండల ఎల్‌హెచ్‌పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పాత్లావత్ సంతోష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్‌శివరాజ్, పాత్లావత్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా జటావత్ వినోద్‌నాయక్, నేనావత్ వెంకటేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, కార్యదర్శులుగా శ్రీనివాస్, అంగోత్ శివశంకర్, రాజేందర్, కోశాధికారులుగా పీర్యానాయక్, రమేశ్‌నాయక్, సభ్యులుగా శ్రీను, దేవేందర్, రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు రాంబల్‌నాయక్ నియామకపత్రం అందజేశారు.